# దైవకృప

**-గుమ్మా సంగమేశ్వరరావు**

"**అం**తా ట్రాష్, ఉద్యోగాల కోసం అప్లై చెయ్యడం, వ్రాత పరీక్షలు వ్రాయటం, ఇంటర్వ్యూలు ఇవ్వడం శుద్ధ దండుగ. బి.కామ్. ఫస్ట్‌క్లాసులో పాసైన నేను ఆ పనికి పనికిరానంట. ముందే ఏ రికమెండేషన్ కేండిడేటుకో లేక లంచం ఇచ్చిన ఏ చచ్చు వెధవకో ఆ పదవి కట్టబెడతారు. రూల్సు ఉన్నాయిగా అందు కోసం ఈ ఫార్మాలిటీ వ్రాత పరీక్షలు, ఇంటర్వ్యూలు" ప్రకాశరావు కోపంగా అంటూ బూట్లు విప్పి దభాలున తలుపుకేసి కొట్టాడు.

పెరట్లో అంట్లు తోముతున్న విశాలాక్షి ఆ చప్పుడుకు ఇంటర్వ్యూకి వెళ్ళిన కొడుకు వచ్చాడని గ్రహించి, చెయ్యిని సీట్లో ముంచి చెయ్యి చీర కొంగుతో తుడుచుకుంటూ వచ్చింది.

"ఏమైందిరా అంత కోపం? ఆ జోళ్ళను అలా విసిరేస్తే అవి ఎన్నాళ్ళు వస్తాయి?" అంది. కొడుకు ఇంటర్వ్యూలో చేసొచ్చిన నిర్వాకం ఆమెకు బోధ పడింది.

"మరో పది నిముషాల్లో దుర్ముహూర్తం వస్తుందని, పొరుగింటి శకుంతల పిన్నిగారు ఎదురొస్తున్నారు, శకునం మంచిదని పదకొండు గంటల ఇంటర్వ్యూకు ఇంటి నుంచి ఎనిమిదిన్నరకే తగిలేశావు. మంత్రాలకు చింతకాయలు రాల్తాయా, శకునాలకు ఉద్యోగాలు వస్తాయా? అమ్మా! ఏభైవేలు లంచం పారేస్తే ఏ ఉద్యోగమైనా చిటికెలో వస్తుందంటే మీరు వినరు" అన్నాడు. ప్రకాశరావు ఏభై వేలిమ్మని ఎప్పటినుంచో అడుగుతున్నాడు.

"ఒరేయ్ అంత పనీ చేయకు. ఆ డబ్బు తినేస్తారు, ఉద్యోగం ఇవ్వరు. వరలక్ష్మి గారి కొడుకు అలానే ముప్ఫైవేలు లంచమిచ్చాడు. ఉద్యోగం రాలేదు, ఆ డబ్బూ తిరిగి రాలేదు. అంతా దగా, మోసం. ఎవరినీ నమ్మలేం"

"ఆ డబ్బుతో నేను వ్యాపారం చేస్తాను" అన్నాడు ప్రకాశరావు.

విశ్వనాథరావు ససేమిరా ఇవ్వనన్నాడు. అతని దగ్గర అంత డబ్బు లేదు. ప్రావిడెంటు ఫండు లోంచి తీసియ్యాలి. అది కూతురి పెళ్ళి కోసం భద్రంగా వుంచాడు.

"కాలం కలసి రావాలి. పది రాళ్ళు విసిరితేనే ఒక రాయి తగులుతుంది. నువ్వు కాళ్ళు కడుక్కురా. ఆ గిన్నెలు కడిగేసి వస్తాను. అప్పుడే మూడు కావస్తున్నది" అంటూ విశాలాక్షి పెరట్లోకి వెళ్ళింది.

విశాలాక్షి భర్త విశ్వనాథరావు గవర్నమెంటు ఆఫీసులో చిన్న ఉద్యోగం చేస్తున్నాడు. వాళ్ళకు ఒక అబ్బాయి, ఒక అమ్మాయి. ప్రకాశరావు బి.కాం. పాసై మూడేళ్లయింది. తను ఫస్ట్ డివిజన్‌లో పాసయ్యాడు. ఉద్యోగం తనను వరిస్తుందని భ్రమపడ్డాడు. విశాలాక్షి దంపతులవి రెండే రెండు కోరికలు. రెండే రెండు సమస్యలు. కూతురికి మంచి సంబంధం చూసి పెళ్ళి

---

## గోదావరి నానీలు

**అ**న్నదాతకే
అన్నం పెట్టిన
చల్లని దేవత
'తల్లి గోదారమ్మ'

రోడ్ కం రైలు వంతెన,
వారధి కాదది
గోదావరికి
వడ్డాణం

గోదా'వరి'వాసుల
గుండెల్లో గుడి
కట్టారు
కాటన్ జన్మ ధన్యం

పాలకులు వారే
కాంట్రాక్టర్లు వారే
ఇంకెక్కడి
బాగోగులు

గోదారమ్మకు
ఏం కష్టమొచ్చిందో...
సంద్రంలో దూకి
ఆత్మహత్య చేసుకుంది

**-తూలుగు రమణారావు**

చేయాలి. కొడుక్కి తొందరలో ఉద్యోగం దొరికాలి. వాడికి ఉద్యోగం వస్తే వాడి పెళ్ళి చెయ్యవచ్చు. వాడి పెళ్ళిలో వచ్చిన కట్నానికి మరింత కలిపి పిల్ల పెళ్ళి చేయవచ్చు.

"నీకు జనరల్ నాలెడ్జి బొత్తిగా లేదు. సారీ, నీకు ఉద్యోగం ఇవ్వలేం" అన్నాడు ఇంటర్వ్యూ కమిటీలో ఒకతను. వ్రాత పరీక్షలో పాసైనా ఉద్యోగం దొరకలేదు.

ఎత్తైన శిఖరం ఏదంటే మౌంట్ ఎవరెస్టు అని చెప్పగలడు. ఇండియాలోని ఎడారిని ఏమంటారు అని అడిగితే థార్ ఎడారి అని చెప్పగలడు. అమెరికా ప్రెసిడెంటు ఎవరో ప్రకాశరావుకి తెలియదు. అలా తెలియకపోవడం మహాపరాధమా? తను చేయవలసిన ఉద్యోగానికి, అమెరికా ప్రెసిడెంటుకు ఏమిటి సంబంధం? ఇప్పటికి అశ్విని నుంచి రేవతి వరకు ఎన్ని నక్షత్రాలున్నాయో అన్ని ఇంటర్వ్యూలకు హాజరయ్యాడు. ఓ పర్యాయం ఒక మెంబరు ఇవాళ తిథి ఏమిటి? నక్షత్రం ఏమిటి అని అడిగాడు. అలా అడిగినతను పోనీ తిరు చూర్ణం పెట్టుకున్నాడా, పట్టు వస్త్రాలు ధరించాడా? ఊహూ! ఇంగ్లీషు వాడిలా సూటూ బూటూ, టై వేసుకున్నాడు. ప్రకాశరావుకి చిర్రెత్తుకొచ్చింది. "సర్, గ్రేగేరియన్ కేలండరు వాడుకలో ఉంది. ఇది ఏ నెలో, ఏ తేదీయో చెప్పగలను. సర్, ఇది పౌరోహిత్యుడి పోస్టు నింపడానికి ఇంటర్వ్యూ కాదు, అకౌంటెంట్ పోస్టుకి" అన్నాడు.

"డిగ్రీ చదివితే చాలదయ్యా! జనరల్ నాలెడ్జి కూడా ఉండాలి. ఇది వ్యయ నామ సంవత్సరం, మాఘ మాసం, బహుళ త్రయోదశి."

"సర్, ప్రతీవాడూ అన్ని విషయాల్లోనూ పారంగతుడు కాలేడు. మీకు జనరల్ నాలెడ్జి పుష్కలంగా ఉందనుకుందాం. సర్, ఫ్రెంచ్ గుయానాకు ప్రెసిడెంటు ఎవరో మీరు చెప్పగలరా?" అన్నాడు. ఇంటర్వ్యూ బోర్డు చైర్మన్‌కు కోపం వచ్చింది. ఆఫ్టరాల్ ఇంటర్వ్యూకి వచ్చిన వాడివి అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పాలి. తెలియకపోతే ఆ మాట చెప్పాలి కాని నన్ను ఇంటర్వ్యూ చేస్తావా? గెట్ అవుట్ ప్లీజ్" అన్నాడు.

"సర్, మీకు ఆ వ్యక్తి ఎవరో తెలియదు. నాకూ తెలియదులెండి" అంటూ విసవిసా బయటికొచ్చాడు ప్రకాశరావు.

❖ ❖ ❖

కొడుకు చెప్పే మాటలను బట్టి విశాలాక్షికి ఒక

## కిందికి దిగిన చూపు

ఏమిటో ఈ రోజు నా చూపు చూపంతా
గంటల తరబడిగా పైపైపే.
నిరాఘాటంగా ప్రసరించడానికి
చుట్టూ ఇంతటి లోకముంది కదా.
ఏముంది పైన?
తెల్లని అద్దకాలున్న నీలిరంగు తెర తప్ప.
పిచ్చి ముదిరిన పై చూపును
నేలపైకి దించడమెలా?
గడసరి చూపు నా స్వగతం విన్నదేమో
హఠాత్తుగా కిందికి దిగొచ్చి
నా చెవులను తట్టి ఇలా అన్నది
"ఓ నా మూలనిధీ / పైన ఏముందంటావా?
అన్ని దిక్కులను పరుచుకుని వున్న
ఎల్లలు లేని సముద్రముంది.
దాని మీదున్నవి అద్దకాలు కాదు/కెరటాల నురగలు.
అది గుర్తించిన నేను హాయిగా
ఆ లోతుల్లోకి మునకలేస్తూ పోతున్నాను
ఇంతలో నీ గుండె పిలుపు వినిపించింది
ఉలికిపడి కిందికి దిగొచ్చాను.
ఇక వెళ్లిపొమ్మంటావా
వేయదగిన మునకలెన్నో వున్నాయి."
అప్పుడు నేనన్నాను-
"ఓసి పిచ్చిచూపా /నీ ముచ్చట తీర్చుకోవడం తప్ప
అక్కడ నువ్వు సాధించిందేమిటి?
ఇక్కడే వుండిపో.
నీ చుట్టూ తిరిగి చూడు
ఏయే సాధు రూపాల మాటున
ఎన్నెన్ని సర్పాలు బుసకొడుతున్నాయో
మంచితనానికి కట్టుపడిన ఎన్నెన్ని వ్యక్తిత్వాలు
వంచనల తొక్కిడిలో
ఊపిరాడక గిలగిల లాడుతున్నాయో
నిశితంగా పరిశీలించి
ఆ నివేదికను నా కళ్లలో ప్రవేశపెట్టు.
పరిష్కారాల కోసం / నిర్విరామంగా ప్రయత్నిద్దాం
ఏమంటావు"
నా సూచనను ఆమోదించిన చూపు
తన కర్తవ్యాన్ని ప్రారంభించింది
అది సమర్పించే నివేదిక కోసమే / నా నిరీక్షణ.

–డా॥ సి.నారాయణరెడ్డి

## బిస్మిల్లాఖాన్

సన్నాయి వెన్నెలా! సన్నాయి వెన్నెలా!!
గంగానది అలలు రిక్కించి వింటున్నది.
చంద్రరేఖ పగులులోంచి
విశ్వాంతరాళం అవ్యక్త సందేశం వినిపిస్తుంది.
ఎగిరే గాలిపటానికి
గాలి చేసిన గాయంలోంచి / గగనం రోదిస్తుంది.
వాడి ఊపిరినిండా / భూగోళం కరిగి కరిగి
కన్నీరై / సెలయేరై
జలపాతమై దూకిన / నిశ్శబ్దనాదం!
రోప్‌వేకు వేళ్లాడుతూ / లోయలపై చేసే
పచ్చపచ్చని ప్రయాణం.
గులాబీలతో / రాళ్లను పగులగొడుతున్న
అపురూప శబ్దం!
కర్ఫ్యూ వీధులగుండా / గాలిగోపురాల, మీనారుల
సూది మొనల్లాంటి శిఖరాలను
మొండిపరుస్తూ వీచే / స్పందనల సుడిగాలి.
షెల్టర్ల ముందు ఆరేసుకున్న
నిద్రరెప్పల మీద / అమ్మతాకిన కొనవేళ్ల స్పర్శ.
పెళ్లలుగా కూలిపడుతున్న
ఇరుకిరుకు సొరంగ మార్గంలో
తరతరాల పెనుగులాట.
ఒంటరినావను / ఒడ్డుకు లాక్కుపోయే
జానపద బాణీల ఆయాసాల తాళ్లు.
క్షుద్ర జగత్తు పడకమీద / రోగి నుదురు నిమిరే
ఎండ పొడల నులివెచ్చని లాలన.
రాగం బిడ్డా! అది రాగం!!
సముద్రకెరటాలను
వెన్నెలలు నిలువునా కోయకముందే
బొట్లు బొట్లుగా రాలిపడే
సంధ్యా సంక్షోభ ధార.
నిద్రపోతున్న
పసిపిల్లల ఉచ్ఛ్వాస నిశ్వాసాల్లో
మెత్తగా నినదించే
ఉపశ్రుతి
పరిమళంలా వ్యాపించే అలౌకిక స్థితి

(మీటింగ్ ఎ మైల్ స్టోన్' సినిమా చూపించినందుకు
గౌతమ్ ఘోష్‌కు కృతజ్ఞతలతో...)

–డా॥ ఎన్.గోపి

విషయం అర్థమైంది. కొడుక్కి తను చదివిన సబ్జెక్టు జ్ఞానమే కాని సామాన్య జ్ఞానం బొత్తిగా లేదు. ఇంటర్వ్యూ నిర్వహించే వాళ్ళు ఏ ప్రశ్నలైనా వేస్తారు కాబట్టి వాటికీ ప్రిపేరు కావాలి. కాని వాడు ఆ పని చెయ్యడు. రమారమి ముప్పై ఇంటర్వ్యూలకు వెళ్లినా వీడు సామాన్య జ్ఞానాన్ని అభివృద్ధి పరచుకోవాలను కోడు. కొడుకులో నైరాశ్యం చోటు చేసుకుంది. అందుకే ఇలా నిరుద్యోగిగా ఉంటాను కాని ఏ పోస్టుకి అప్లయ్ చేయనని భీష్మించుకు కూర్చున్నాడు. తాము బ్రతికి ఉన్నంత వరకు వాడు తమకు బరువుకాడు. ఆ తరు వాత అడుక్కుతింటాడా? నారు పోసిన వాడు నీరూ పోస్తాడు. వాడు మగపిల్లాడని సరిపెట్టుకుంటే అమ్మాయి పెళ్ళి ఎలా జరిగేను?

కొంచెం ప్రిపేరు అయితే ఉద్యోగం దొరుకు తుందిరా అని చెప్పినా వీడు వినడంలేదు. ఎలా?

విశాలక్ష్మి రోజూ విధిగా గుడికి వెళ్తుంది. ఆమె దైవాన్ని కోరేది రెండే. ఒకటి తన కుమారుడికి ఉద్యోగం ఇప్పించు అని, రెండోది పిల్లదానికి మంచి వరుణ్ణి చూపించు అని.

"ప్రకాశం! ఇవాళ దేవాలయంలో నాకొక సజ్జనుడు కనిపించాడు" అంది విశాలాక్షి.

"అమ్మా! దేవాలయాలకు సజ్జనులే వస్తారు. కాని దుర్జనులు కాదుగా?" అన్నాడు.

"చాల్లే నీ హాస్యాలు. అతనెలా పసిగట్టాడో మనం కష్టాల్లో ఉన్నామని."

"దివ్య దృష్టి ఉందనుకోను. నువ్వు దేముడి ముందు మొరపెట్టుకున్నది అతను విని ఉంటాడు."

"అది సరే, నీ కొడుక్కి ఉద్యోగం ఇప్పించే పూచీ నాది. ఫలానా పత్రికలో రైల్వే బోర్డు, భువనేశ్వర్ వారి ప్రకటనను చూశారా? మీ వాడిని అప్లయ్ చేయ మనండి. తతిమ్మావి నేను చూసుకుంటాను" అన్నాడు.

"ఎవరమ్మా అంత ఉదారుడు, డబ్బు ఏమైనా ఇమ్మన్నాడా?"

"ఛా! అలా అనకు కళ్ళుపోతాయి. అతడు దేవతా స్వరూపుడు. దేముడే నా మొర విని అతడి నోట ఆ పలుకులు పలికించాడు. నువ్వు తక్షణం ఆ పోస్టుకి అప్లయ్ చెయ్యి" అంది.

"నాకేం, నాన్నగారికి మరో ఆరేడు వందలు ఖర్చు. నాదేం పోయింది నీ మాట కాదనను."

❖ ❖ ❖

వ్రాత పరీక్షలో బాగానే వ్రాసిన ప్రకాశరావు ఇదీ

అంతే. ఇంటర్వ్యూలోనే నేను తప్పేది" అన్నాడు తల్లితో.

"నాయనా ప్రకాశం! గాలిలో దీపముంచి దేవుడా నీదే భారం అన్నా ఆ దీపం ఆరిపోతుంది. ఆ దీపాన్ని గాలి నుంచి మనమే కాపాడాలి. అలాగే ఎంత ఉపకారం ఇతరులు చేస్తామన్నా మన ప్రయత్నం మనమూ చేయాలి. ఇది ఆఖరిదంటున్నావు నువ్వు. అతను హామీ ఇచ్చాడు ఉద్యోగం నీకు తప్పక దొరుకుతుందన్న నమ్మకం నాకూ ఉంది. అయినా నువ్వు బాగా ప్రిపేరు కా. అతనికి మాట రాకూడదు అంది. సరేననిపించింది కొడుకుచేత.

ఇంటర్వ్యూకి రమ్మనమని పిలుపు వచ్చింది ప్రకాశరావుకి.

"దేముడా! నా కొడుక్కి అబద్ధపు మాట చెప్పి వాడిని పరీక్షకు తయారు చేయించాను. వాడికి ఉద్యోగం దొరికేలా చేయడం నీ బాధ్యత. ఒకవేళ వాడికి ఉద్యోగం దొరక్కపోతే నువ్వు లేవనే అనుకుంటాను" అంటూ ఆ పరమేశ్వరుడికి మొక్కింది విశాలాక్షి.

ప్రకాశరావు ఇంటర్వ్యూకి వెళ్ళడానికి మూడు రోజుల ముందు ఆఫీసు పనిమీద విజయనగరం వెళ్తున్నానని విశ్వనాథరావు రైలెక్కాడు.

"బాబూ! ఇప్పటివరకు నీతో అబద్ధం చెప్పాను కాని ఆ ఆఫీసరు లంచం అడిగాడురా" అంది కొడుకు భువనేశ్వర్‌కు బయలుదేరే ముందు.

"అమ్మా! కొంపతీసి లంచం ఇచ్చావా? ఆ వర లక్ష్మి గారి మాట మరచిపోయావా? ఎంత పని చేశావు?" అన్నాడు ప్రకాశరావు.

"లేదురా, నేనతనికి ఇంతవరకు ఏమీ ఇవ్వలేదు. నీకు ఉద్యోగం దొరికితే మొదటి నెల జీతం అతనికిస్తానన్నాను."

"నయమే!" అన్నాడు ప్రకాశరావు.

❖ ❖ ❖

"విశాలాక్షీ! ఈ పర్యాయం నీ కోరిక ఈడేరుతుంది" విశ్వనాథరావు భార్యకు హామీ ఇచ్చాడు.

"అంతా దేముడి దయ" అంది విశాలాక్షి.

"అమ్మా! దేముడి దయ కాదు. నువ్వు లంచంగా ఆ సజ్జనుడికి ఎరచూపిన డబ్బు చలవ. ఈ పర్యాయం వాళ్ళు నన్నేం తికమక, చచ్చు ప్రశ్నలు వేసి వేధించ లేదు. నీ పేరేమిటని అడిగారు. ఏ సంవత్సరంలో బి.కాం. పాసయ్యావని అడిగారు. నాన్నగారి పేరు అడిగారు. ఇవి వేయవలసిన ప్రశ్నలా? ఆ వివరాలు నా అప్లికేషన్ ఫారంలో ఉన్నాయి."

విశాలాక్షి మొదటి కోరిక నెరవేరింది. ప్రకాశరావుకి ఉద్యోగం వచ్చింది.

"అమ్మా! ఇప్పుడన్నా చెప్పమ్మా. నాకు ఉద్యోగం ఇప్పించింది ఎవరు? అక్కడ ఇంటర్వ్యూ కమిటీలో ముగ్గురున్నారు. ఒకతని పేరు ఈశ్వరరావు, రెండో అతను మహేంద్రనాథ్, మూడో వ్యక్తి ఉదయ శంకర్

## కాలం వృత్తమయితే

కాలాన్ని చదివేందుకు
గడియారాన్ని ఎందుకు ఆవిష్కరించుకున్నారో
నాకిప్పుడర్థమైంది
కాలాన్ని బిందువులుగా విడదీసి కలిపితే
వృత్తంగా రూపాంతరీకరణం చెందింది
సెక్టారు సెక్టారులుగా విడిపోయిన కాలం
ఎన్ని సంఘటనలను తనలో నింపుకుందో?
కొన్ని హృదయాన్ని గాల్లో నిలబెట్టేవి
కొన్నేమో హృదయానికి అదనపు భారాన్ని తోడుచేసేవి
ఇంకా కొన్ని ఆనందంతో పంచదార తినిపించేవి
ఇన్ని సంఘటనలకు ఊపిరి పోసిందెవరు?
కాలాన్నే గుర్తుచేసుకొని చెప్పమనాలి.

కాలం వృత్తం మీద బిందువున్నేను
పాతకాలంలో స్పష్టీకరిస్తే నా వెనుక
ఎందరో... లెక్కకు మించి
తరువాత విడమరిస్తే నా ముందు
ఇంకా ఎందరున్నారో... ఆలోచనకు మించీ
ఇలా అందరూ చీమల వరుసలా
ఒకరి వెనుక ఒకరుగా కాలం వృత్తం మీద తిరగటం
నాకెందుకో నచ్చదు
నాక్కావలసింది కాలం వృత్తం మీద
స్తబ్దంగా చరించే బిందురూపం కాదు
ఆ వృత్తం ఏర్పడటానికి
ఆధారమయిన కేంద్ర బిందు రూపం
దాన్ని తెలుసుకోవాలి
అప్పుడు కాలం వృత్తాన్ని చూపుడు వ్రేలిమీద
నిలుపుకోవచ్చు
ఆ వృత్త కేంద్రాన్ని స్పృశించడానికి
నా జీవితం వృత్తమయితే బాగుండు.

-తోకల రాజేశం

## శ్వేత తాజ్...

ఒక నిత్య సౌందర్యవతి వెన్నెముక
అమ్మాయి కొనగోటివంక చూసి
నేల రాలిన నెలవంక / చుక్కల్ని వెక్కిరించే
పిండారేసిన వెన్నెలగీతిక
మట్టి సముద్రమైన భూమండలంపై
ఏకైక శ్వేత లంక / యమున శిరోజాల్లో
ఏనాడూ వాడని మల్లెమొగ్గ / చినుకుల కౌగిలిలో
నేలపై విరిసిన నీటిబుగ్గ
ప్రేమించే ప్రేయసి మునివేళ్ళను ముద్దాడే కొనగోరు
ఎడారిలో బాటసారి దాహానికి దొరికిన సెలయేరు
ప్రేమ శతృవుల శిబిరంపై ఎగరేసిన విజయపతాకం
మృత్యుముఖంపై నిర్లక్ష్యంగా విసిరేసిన ప్రేమసంతకం
భూమిపై నిలిచిన తొలి నక్షత్ర క్షేత్రం
మంచును నింపుకున్న పత్తిపువ్వు
కంచెలు లేని పసిపాప బోసినవ్వు
ఆకాశంలోంచి హఠాత్తుగా ఊడిపడిన తెల్ల సముద్రం
మండుటెండలో సైతం కళ్లలో నిలిచే చలివేంద్రం
ప్రేమ గుండెలోంచి ఉబికిన పాలసంద్రం
పండువెన్నెలలో నిండిన వెండి చంద్రం
పాలరాతికి పూచిన ఓ సంపెంగ
పాలధారతో గడ్డకట్టిన సరిగంగ
గర్భగుడిలో ఆరిపోని ఓ కర్పూరం
చరిత్ర గోడకు కొట్టిన తిరిగిరాని సున్నం
చరిత్ర పచ్చికపై వాలిన చెరిగిపోని మంచుబిందువు
ధరిత్రలో నిలిచి కరిగిపోని అలలు లేని శ్వేతబిందువు
చినుకులలో ఘనీభవించి/నేలపై రాలిన వెండిమేఘం
జగతికి వెన్నెల దీపం
కనులమూలకు నిలిచిన సజీవ స్వప్న శిల్పం
ఆకాశం తన అందాన్ని చూసుకునే
ఒకే ఒక అద్దం ముక్క/కాలాతీత ప్రేమికుల కళ్ళకు
కనిపించిన తొలి వేగుచుక్క
యమునలో పిండి ఆరేసిన ఖద్దరుగుడ్డ...
నక్షత్రాలు ప్రేమతో చూసుకునే వెన్నెల బిడ్డ
తెల్లసొగసులు నింపుకున్న ముత్యపుచిప్ప
పల్లెల్లో వెన్నెల్లో ఆడుకున్న వెన్నెల కుప్ప
ప్రపంచంలో తొలిసారి పుట్టిన శ్వేత గులాబి
ప్రేమ మత్తును లోకానికి/గమ్మత్తుగా తెలిపిన షరాబి
ఆకాశపు ఉంగరంలో / అవని చూపుడు వేలికి
తొడిగిన ముత్యం / అనంతకాలం
అంతులేని ప్రేమ సత్యం/ఏ కాలాన్నైనా ఏకకాలం చేసి
కలకాలం నిలిచే ప్రేమైక జీవితం
గతంలో వర్తమానంలో / రాబోయే కాలంలో
కాబోయే ప్రతి కవికి తానో తెల్లని కాగితం.

-వై. శ్రీరాములు

అని తెలుసుకున్నాను. వీరిలో ఎవరు? అతనికి నా కృతజ్ఞతలు చెప్పాలి."

విశాలాక్షి కొడుకలా అంటే ఆశ్చర్యపోలేదు. కాని వాడికి వాస్తవం చెప్పదలుచుకోలేదు. ఆ ముగ్గురిలో ఏ ఒక్కరూ కాదు. ఆ పేరు గల వ్యక్తులను తను కలవలేదు. అసలు చూడలేదు. తాను దైవాన్నే నమ్ముకుంది. కుర్రాడికి ఉద్యోగం దొరికితే మొదటి నెల జీతం హుండీలో వేస్తానని మొక్కుకుంది.

"ఆ మాట అడగకు. అతను ఎట్టి పరిస్థితులలోనూ తన పేరు బహిర్గతం చేయవద్దని మాట తీసుకున్నాడు" అంది.

❖ ❖ ❖

"అమ్మా! ఇది నా మొదటి నెల జీతం" అంటూ తల్లికి ఆరువేల ఏడువందల రూపాయలిచ్చాడు. అయితే అతనెవరో తెలుసుకోవాలన్న కోరికతో డబ్బు పట్టుకొని వెళ్తున్న తల్లిని ఆమెకు తెలియకుండా అనుసరించాడు. తల్లి ఎవరో అధికారికి ఇస్తానన్న డబ్బు హుండీలో వేస్తే ఆశ్చర్యపోయాడు.

"అమ్మా! ఏ అధికారికో లంచం ఇవ్వాలని నా దగ్గర తీసుకున్న సొమ్ము దేముడి హుండీలో వేశావా?" అడిగాడు.

"అయ్యో! నువ్వు చూసేవా? బాబూ ఇంక అబద్ధమెందుకు? నాకే అధికారీ తెలియదు. నేను పూర్తిగా భగవంతుడినే నమ్మాను. అతనే నీకీ ఉద్యోగం ఇప్పించాడు. నీకు ఉద్యోగం దొరికితే నీ మొదటి నెల జీతం దేముడికి సమర్పిస్తానని మొక్కుకున్నాను" అంది.

"విశాలం! నిజమే, దేముడే నీ కొడుక్కి ఉద్యోగం ఇప్పించాడు. అయితే రావణుని చంపాలనుకున్న దేముడు రాముడై పుట్టాడు. భస్మాసురుని చంపిన విష్ణువు జగన్మోహిని అవతారం ఎత్తాడు. అలాగే దేముడు ఉదయశంకర్ రూపంలో నీ కొడుక్కి ఉద్యోగం ఇచ్చాడు. ఉదయశంకర్ నా బాల్యమిత్రుడు. రైల్వేలో పెద్ద హోదాలో ఉన్నాడని ఇటీవలే తెలిసి, విజయనగరం వెళ్తున్నానన్న మిషమీద భువనేశ్వర్ వెళ్ళి ఆయన్ను కలిశాను. ఆయన నాకిచ్చిన మాట నిలబెట్టుకున్నాడు" అన్నాడు విశ్వనాథరావు.

"మీరన్నదే నిజం. అయితేనేం ఇదంతా దేముని కృప. ఆ భగవంతుడే ఉదయశంకర్ రూపంలో మన పట్ల కనికరం చూపించాడు. శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదని మీరెరగరా?" అంది విశాలాక్షి. ■